విలక్షణ నటుడు చంద్రమోహన్

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

విలక్షణ నటుడు చంద్రమోహన్‌ను సినీ పరిశ్రమ కోల్పోయిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తన నటనతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్న చంద్రమోహన్ ఆకస్మిక మరణం బాధాకరమన్నారు. ఎన్నో చిత్రాల్లో అద్భుతంగా నటించి ఆయా పాత్రలకు ప్రాణం పోసిన నటుడని కొనియాడారు. ఆయన సినీ ప్రస్థానం ఒకటి కాదు రెండు కాదు 50 సంవత్సరాలపైనే. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా కమెడియన్‌గా ఆయన సాగించిన సినీ ప్రయాణం తెలుగు వాళ్లందరూ ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బాణాసంచా దుకాణాలు వెలవెల..!

- పేలుతున్న మందుగుండు సామగ్రి ధరలు
- తగ్గిన కొనుగోళ్లు
- వ్యాపారుల ఆవేదన
- పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంటలో బాణాసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. దీపావళి ముందు రోజు శనివారం కూడా కొనుగోలుదారుల కోసం దుకాణదారులు నిరీక్షిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, వ్యవసాయం ఆశాజనకంగా లేకపోవడం బాణాసంచా ధరలు కూడా భారీగా పెరగడమే కారణమని చెబుతున్నారు. దీనికితోడు వాతావరణంలో మార్పులు కూడా వ్యాపారులను మరింత కలవర పెడుతోంది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టామని, అమ్మకాలు లేకపోవడంతో ఏంచేయాలో పాలుపోవడం లేదని బాణాసంచా వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆచంటలో అమ్మకాల్లేక వెలవెలబోతున్న బాణాసంచా దుకాణాలు

దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సుల జారీలో భారీగా ముడుపులు తీసుకున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఒక దుకాణానికి లైసెన్స్ తీసుకుని రెండు, మూడు ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా మండలంలో ఎంతమందికి లైసెన్సులు మంజూరు చేశారనే సమాచారం కూడా స్థానిక అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. దుకాణాల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను అనుమతి కోసం ఉన్నతాధికారులకు పంపామని, ఎంతమందికి లైసెన్సులు మంజూరు చేశారనే సమాచారం ఇంకా తమకు రాలేదని స్థానిక అధికారులు చెబుతుండడం విశేషం. అయితే పంచాయతీ స్థాయి నుంచి డివిజన్ స్థాయి వరకూ ముడుపులు తీసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాల్సిన దుకాణాలను ప్రధాన సెంటర్లో, జన సంచారం మధ్య ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. ఒక్కో దుకాణదారుడు రూ.40 నుంచి రూ.50 వేల వరకూ ముడుపులు చెల్లించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మట్టి ప్రమిదలకు తగ్గిన గిరాకీ..

విజయానికి చిహ్నంగా జరుపుకునే దీపావళి పండుగ రోజున మట్టితో చేసిన ప్రమిదల్లో దీపాలు వెలిగించడం అనాదిగా వస్తున్న సాంప్రదాయం. కాస్త స్తోమత కలిగిన కుటుంబాలు భారీగా దీపాలు వెలిగించి తమ దర్పణాన్ని ప్రదర్శిస్తుండేవారు. కాలక్రమంలో లోహంతో చేసిన దీపాలు కొవ్వొత్తుల వినియోగం, విద్యుత్ దీపాలతో అలంకరణలు పెరగడంతో మట్టి ప్రమిదలకు గిరాకీ తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రమిదలు, చిచ్చుబుడ్ల తయారీదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమిదలు, చిచ్చుబుడ్డులను సారెపై తయారు చేస్తామని, వాటిని ఎండలో పెట్టి ఆరిన తర్వాత కాలుస్తామని నిర్వాహకులు సత్యనారాయణ తెలిపారు.

పెనుమంట్రలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణాలు

టపాకాయకులకు తగ్గిన ఆదరణ

పెనుమంట్ర : గతంలో గ్రామీణ ప్రాంతాల్లో దీపావళి పండుగకు 15 రోజుల ముందు నుంచే టపాసుల మోత మోగేది. నేడు ఆ సందడే కానరావడం లేదు. గ్రామాల్లో ఎక్కువగా టపాకాయలు కాల్చేవారు. ప్రస్తుతం వాటి తయారీ తగ్గింది. శనివారం ఆలమూరులో కొంతమంది మాత్రమే వ్యాపారులు వాటిని విక్రయిస్తున్నారు. కట్టకు 25 చొప్పున ఉంటాయని, ధర రూ.70 నుంచి రూ.80ల వరకూ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆలమూరులో వేప పువ్వు సెంటర్, హైస్కూల్ ప్రాంగణంలో ఈ టపాసులను ఏటా పొత్ర కుటుంబానికి చెందిన కొంతమంది మాత్రమే విక్రయిస్తారు. అయితే ప్రస్తుతం అమ్మకాలు అంతగా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డు సమీపంలోనే దుకాణాలు

దీపావళి పండుగ నేపథ్యంలో పంచాయతీ ఎదురుగా నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగుతున్నప్పటికీ అధికారులు దృష్టి సారించకపోవడం పట్ల స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక్కో దుకాణానికి నాలుగు మీటర్ల దూరం ఉండాలని అధికారులు చెబుతున్నా వ్యాపారులు కనీస దూరం పాటించడం లేదు. మందుగుండు సామగ్రి దుకాణాల వెనుక డంపింగ్ యార్డు ఉంది. ప్రమాదం ఏమైనా జరిగితే బాధ్యత ఎవరిదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై అత్తిలి ఫైర్ ఇన్‌ఛార్జి ఎస్ఐ కె.వెంకటరెడ్డిని వివరణ కోరగా తమ పరిధిలో 18 లైసెన్స్ ఇచ్చినట్టు తెలిపారు. అదేవిధంగా పెనుమంట్రలో నాలుగు దుకాణాలకు మాత్రమే లైసెన్స్ ఇచ్చినట్టు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

కాళ్ల : మండలంలోని పలు గ్రామాల్లో బాణాసంచా దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేవు. బాణాసంచా ధరలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ధరలు రెండు రెట్లు పెరిగాయి. దీంతో అందరూ ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగ ధనవంతుల పండుగగా మారిపోయింది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు సాధారణ టపాసులకు బదులు హరిత టపాసులు కాల్చాలని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరరావు సూచించారు. శబ్దకాలుష్యం లేకుండా ప్రజలంతా సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. ఐఎస్ఐ మార్కు గల బాణాసంచా మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పొగను వెదజల్లే మందులను కాల్చకపోవడమే మంచిదన్నారు

మండలంలో 19 షాపులకు అనుమతులున్నాయి. ఆకివీడు ఫైర్‌స్టేషన్ పరిధిలో 32 షాపులకు అనుమతులున్నాయని అగ్నిమాపక అధికారి వై.నాగేశ్వరావు తెలిపారు. కాళ్ల, కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లో బాణాసంచా దుకాలను పరిశీలించి పలు సూచనలిచ్చారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

పాలస్తీనాపై దాడిని ఖండిస్తూ నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నేతలు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ అమాయకమైన పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూ మహిళలు, చిన్నారుల ప్రాణాలను బలిగొనడం అన్యాయమన్నారు. లక్షల మందిని శరణార్థులు చేస్తూ ఆహారం, తాగునీరు అందక ఆర్తనాదాలు చేస్తున్న అమాయక ప్రజలకు అన్యాయం చేసే హక్కు ఏ దేశానికీ లేదన్నారు. ప్రపంచ దేశాలన్నీ పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలపాలన్నారు. ఇజ్రాయిల్ అన్యాక్రాంతం చేసిన పాలస్తీనా భూభాగాన్ని వారికి అప్పజెప్పాలన్నారు. పాలస్తీనీయులపై దాడి అంతర్జాతీయంగా రాజకీయ ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయన్నారు. పాలస్తీనా ప్రజల పట్ల ఇజ్రాయిల్ దాడి అన్యాయమని, దీన్ని ప్రధాని మోడీ తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పొన్నాడ రాము, నోములు కొండ బూడిద జోగేశ్వరరావు, పొగాకు నారాయణరావు, ఎండి అజీజ్, అప్పలనాయుడు, తిరుమాని సత్యనారాయణ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి

ప్రజాశక్తి - భీమవరం

విద్యా రంగం అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి తెలిపారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో భారతదేశ తొలి విద్యా శాఖా మంత్రి, స్వాతంత్ర సమరయోధులు, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ఆజాద్ సేవలు నిరుపమానమని తెలిపారు. స్వాతంత్ర సంగ్రామంలో జాతి కోసం ఆయన విశేష కృషి చేశారన్నారు. భారత దేశ తొలి విద్యాశాఖా మంత్రిగా పనిచేసి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని వివరించారు. ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.మహేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఎఒ ఎం.శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ హెచ్‌వి.శేషుమూర్తి, ప్రధాన మంత్రి 15 సూత్రాల పథకం సభ్యులు పాల్గొన్నారు.

ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ, సిబ్బంది

పవర్ లిఫ్టింగ్‌లో నిట్ విద్యార్థికి కాంస్య పతకాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం గర్వించదగ్గ విషయమని నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్‌రెడ్డి తెలిపారు. నిట్ కళాశాలలో ఇసిఇ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి టి.మంజునాథ్ పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్ పోటీల్లో కాంస్య పతకాలను సాధించాడు. కలకత్తాలోని ఎన్ఐటి దుర్గాపూర్‌లో ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ ఎన్ఐటి పోటీలకు దేశంలోని 28 ఎన్ఐటిల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో తాడేపల్లిగూడెం నిట్ విద్యార్థి మంజునాథ్ 100వ విభాగంలో పవర్ లిఫ్టింగ్, బాడీ బిల్డింగ్‌లో ప్రతిభ కనబర్చి కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాడు. ఇతనికి జిమ్ ట్రెయినీగా ఎం.సూర్యప్రకాష్ వ్యవహరించాడు. నిట్ రిజిస్ట్రార్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి, మంజునాథ్‌ను, అలాగే వివిధ పోటీల్లో నాలుగు, ఐదు స్థానాలు సాధించిన క్రీడాకారులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపి నిట్ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయమన్నారు. మంజునాథ్ స్ఫూర్తితో మిగిలిన క్రీడాకారులు కూడా వివిధ పోటీల్లో రాణించి సంస్థకు పేరు తేవాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, సాస్ ఫ్యాకల్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ తీపర్తి, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ జి.కిరణ్ కుమార్, డాక్టర్ యువరాజు పాల్గొన్నారు.

మంజునాథ్‌ను, క్రీడాకారులను అభినందిస్తున్న దినేష్ శంకర్‌రెడ్డి

టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ఎంఎల్ఎ నిమ్మల భిక్షాటన

15న వంటా వార్పు - బహిరంగ సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు అండగా ఉంటామని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు తెలిపారు. వైసిపి ప్రభుత్వ తీరును నిరసిస్తూ శనివారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో దుకాణాదారుల వద్దకెళ్లి మహిళా లబ్ధిదారులు, టిడిపి శ్రేణులతో కలిసి ఎంఎల్ఎ నిమ్మల భిక్షాటన చేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దుకాణదారులతోపాటు రహదారి వెంబడి చిన్నపాటి వ్యాపారులు నిరసనకు సంఘీభావం తెలిపారు. జగన్ ప్రభుత్వం ఇళ్ల పేరుతో పేదలు, మహిళలను మోసం చేసిందని, ప్రభుత్వం కళ్లు తెరిచేలా ఈ నెల 15వ తేదీన తలపెట్టిన పాలకొల్లు చూడు, వంటా వార్పు, బహిరంగ సభకు లబ్ధిదారులు తరలిరావాలని ఎంఎల్ఎ కోరారు. పదో వార్డులో నడిరోడ్డుపై శుక్రవారం రాత్రి బసచేసిన ఆయన శనివారం ఉదయం అక్కడ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర 19వ వార్డు వరకూ సాగింది. రాత్రి 18వ వార్డు టిడ్కో ఇంటి లబ్ధిదారుల ఇళ్ల వద్ద నడిరోడ్డు పైనే బసచేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పాలకొల్లులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు ఇంటి అద్దెలు, బ్యాంకు వాయిదాలు చెల్లించలేక భిక్షాటన చేసుకునే పరిస్థితిని జగన్ ప్రభుత్వం కల్పించిందని విమర్శించారు. టిడ్కో గృహాల పేరుతో మోసపోయిన మహిళలకు న్యాయం జరిగేలా ఈనెల 15న వినూత్న నిరసనలో వంటావార్పు, బహిరంగ సభకు పెద్ద ఎత్తున లబ్ధిదారులు కుటుంబాలతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. నా ఇల్లు నా సొంతం ప్రజా ఉద్యమం ద్వారా జగన్ ప్రభుత్వం దిగి వస్తుందన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులందరికీ రుణభారం లేకుండా ఉచితంగా ఇళ్లు ఇవ్వాలని, ఇళ్ల స్థలాలను నివాస ప్రాంతాల్లోనే ఇవ్వాలని ఎంఎల్ఎ డిమాండ్ చేశారు.

పాలకొల్లు మెయిన్ రోడ్డులో భిక్షాటన చేస్తున్న ఎంఎల్ఎ, మహిళలు

నిర్లక్ష్యం ఎవరిది..?

వరుస ఘటనలు.. గాలిలో ప్రాణాలు.. అనే పరిస్థితి రెండు జిల్లాల్లో నెలకొంది. ఆర్‌టిసి, కళాశాల బస్సుల ప్రమాదాలు తీవ్ర భయభ్రాంతులకు గురిచేశాయి. ఆచంట మండలంలో కరెంటు స్తంభం పడి విద్యార్థి దుర్మరణం తీవ్ర ఆవేదనకు గురిచేశాయి. ఈ ఘటనలన్నింటికీ నిర్లక్ష్యం ఎవరిదనే అంశంపై సర్వత్రా చర్చ సాగుతోంది.

పర్యవేక్షణ, తనిఖీ యంత్రాంగాలను పాలకులు నిర్వీర్యం చేయడంతో రహదారి ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీనికితోడు అధ్వానంగా తయారైన రోడ్ల పరిస్థితి ప్రమాదాల తీవ్రతను మరింత పెంచుతోంది. ఏలూరు సమీపంలో కళాశాల బస్సు బోల్తా పడి సుమారు 20 మంది విద్యార్థులు గాయాల పాలవ్వడం, తాడేపల్లిగూడెంలో విద్యాసంస్థ బస్సు ఢీకొని అదే విద్యాసంస్థకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందడం అందరినీ కలచివేసింది. ఏలూరు ఘటన జరిగిన తర్వాత రెండు రోజులు రవాణాశాఖాధికారులు ప్రయివేటు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేసి హడావుడీ చేశారు. కనీసం డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ఈ బస్సులను నడుపుతున్నారంటే తనిఖీ వ్యవస్థ నిర్లక్ష్యం, ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాల బరితెగింపు ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది. అనుమతులు, ఫిట్‌నెస్ లేని బస్సుల సంగతి వేరే చెప్పనవసరం లేదు. మరి ఈ స్థాయిలో ప్రయివేటు విద్యాసంస్థల బస్సులు పెద్దసంఖ్యలో విద్యార్థులతో రోడ్లపై పరుగుపెడుతూ అటు విద్యార్థుల, ఇటు రోడ్లపై ప్రయాణించే సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే సంబంధిత శాఖల అధికారులు ఏం చేస్తున్నారనేది అందరినీ వేధిస్తున్న ప్రశ్న.

ఇక ఆర్‌టిసి బస్సులు తరచూ రోడ్లపై మొరాయిస్తున్నాయి. ఎక్కడ ఏ బస్సు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. ఇటీవల జంగారెడ్డిగూడెంలో నిడదవోలు డిపోనకు చెందిన ఆర్‌టిసి బస్సులో మంటలు రావడం, వీరవాసరంలో భీమవరం డిపో బస్సు అదుపు తప్పి కుడిపక్కకు దూసుకెళ్లి మోటారు సైక్లిస్టు మృతికి కారణం కావడంతో ఆర్‌టిసి బస్సులు కన్పిస్తేనే కంగారుపడే పరిస్థితులు నెలకొన్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. వీరవాసరం ఘటనలో బ్రేకులు ఇతర సమస్యలపై డ్రైవర్లు గ్యారేజీలో వివరించినా అదే బస్సును ఇచ్చి పంపడం అధికారుల, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. విజయవాడ బస్టాండులో ఫ్లాట్‌ఫారంపైకి బస్సు దూసుకెళ్లడానికి పర్యవేక్షణాధికారుల తప్పిదమే కారణమని, ఫలితంగా మూడు ప్రాణాలు గాలిలో కలిశాయనేది అందరికీ తెలిసిందే. ఆ ఘటన తర్వాత కూడా కనీసం డిపోస్థాయి అధికారులు అప్రమత్తంగా లేకపోవడం, ప్రభుత్వం నుంచి కనీసం హెచ్చరికలు లేకపోవడం ప్రజారవాణా వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే ప్రభుత్వ విధానాలకు ప్రతిబింబంగా చెప్పుకోవచ్చు. గ్యారేజీలో పలు విభాగాలను ప్రయివేటుపరం చేయడం, స్పేర్ పరికరాలు అందుబాటులో లేకపోవడంతో బస్సుల పరిస్థితి అధ్వానంగా తయారవుతోంది. దీనికితోడు రోడ్లు అధ్వానంగా ఉండడంతో బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వీటికి తాత్కాలిక ప్రాతిపదికన మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రభుత్వం సైతం కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా డొక్కు బస్సులనే తిప్పడం, అద్దె బస్సులపైనే ఎక్కువ ఆసక్తి చూపడం గమనార్హం. మొత్తంగా ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆర్‌టిసి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని పరిశీలకులు చెబుతున్నారు.

ఆచంట మండలం అయోధ్యలంక గ్రామ పరిధిలోని మర్రిమూలలో పాఠశాల విద్యార్థిపై కరెంటు స్తంభం పడి మృతి చెందడం తీవ్ర విషాదం నింపింది. స్తంభం పడిపోయే ప్రమాదం ఉందని ఆ గ్రామస్తులు పదేపదే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఒక చిన్నారి ప్రాణం కోల్పోవడంపై ఎవరు బాధ్యత వహిస్తారో పాలకులే చెప్పాలి.

'మళ్లీ జగనే ఎందుకు కావాలి' అని ఊకదంపుడు ప్రచారం చేస్తున్న వైసిపి శ్రేణులు, దీనికి వంతపాడుతున్న అధికారగణం ఈ ఘటలన్నింటికీ సమాధానం చెప్పి ఆ ప్రచారం చేసుకుంటే మంచిదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. లేని పక్షంలో 'మళ్లీ జగనే ఎందుకు వద్దు' అనేది ప్రజలే చెబుతారని హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్‌వి.ప్రసాద్

ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలి

తణుకు రూరల్ :ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరి భారీ బహిరంగ సభలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం రక్షణ భేరి బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకొచ్చాక ప్రజలపై భారాలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వరంగాన్ని అదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు కారు చౌకగా ఇచ్చేస్తున్నారని విమర్శించారు. యువత ఎప్పుడూ లేనివిధంగా నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నారన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చారో మోడీ ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. ప్రజలు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత ఉద్యమిస్తుంటే నిర్బంధాలు, అక్రమ అరెస్టులు, కేసులు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. సిపిఎం ప్రజారక్షణ భేరి సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎ.అజయకుమారి, గార రంగారావు, కామన మునిస్వామి, గోపి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు : ముదునూరి

ప్రజాశక్తి - మొగల్తూరు

అర్హులందరికీ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలం లోని కాళీపట్నం తూర్పు పంచాయతీలో పల్లెనిద్ర చేసిన రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శనివారం వేకువ జామునే లేసి వాకింగ్ చేస్తూ గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తన దృష్టికి వచ్చిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అర్హతున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు భవిష్యత్తులో కొనసాగాలంటే మరలా ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్ కావాలని అన్నారు. పేదలకు అందిస్తున్న సంక్షేమాభివృద్ధి గురించి ఆయన ప్రజలకు వివరించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి తిరుమాని బాబ్జి, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, తణుకుల వెంకన్న, రమేష్, కొల్లాబత్తుల రవి, నారాయణ, రాజు, కవురు పెద్దిరాజు, బొక్కా ఆంజనేయులు, నేతల నాని, బాలం దాసు, తన్నీడి గిరి, నగేష్, గోడపాటి జయరాజు, బి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

నెట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్ల విజయం

ప్రజాశక్తి - భీమవరం

నెల్లూరు జిల్లా ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి 67వ స్కూల్ గేమ్స్ నెట్ బాల్ బాల బాలికల పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్లు విజయం సాధించాయి. ఈ పోటీల్లో విజయం సాధించిన జట్లను కోచ్, మేనేజర్ ఎన్.విజయలక్ష్మి, పి.దావూద్‌ఖాన్, పి.శ్రీనివాస్, వినీత్, విజయ్‌కుమార్‌ను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు మల్లేశ్వరరావు, రాజేందర్ అభినందించారు.

ప్రథమ స్థానం సాధించిన జిల్లా జట్టు

అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జానకిరామ్

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్వతంత్ర భారతదేశ తొలి విద్యా శాఖామాత్యులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు శనివారం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జానకిరామ్ మాట్లాడుతూ భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ గొప్ప పండితుడు, రాజనీతిజ్ఞుడు, గొప్ప స్వాతంత్ర్య సమరయోధుల్లో ఒకరని కొనియాడారు. స్వతంత్ర భారత విద్యావ్యవస్థ అభివృద్ధిలో భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, పరిశోధనా సంచాలకులు డాక్టర్ నాగ నాయుడు, డాక్టర్ సలోమి సునీత, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్, ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జునరావు, డిప్యూటీ రిజిస్ట్రార్, కిరణ్, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆదిత్య పాల్గొన్నారు.

చంద్రమోహన్ మృతి విచారకరం

పాలకొల్లు కళాకారుల సంతాపం

ప్రజాశక్తి - పాలకొల్లు

విభిన్న పాత్రలు అలవోకగా పోషించిన సీనియర్ నటుడు చంద్రమోహన్ ఆకస్మిక మృతిపై పాలకొల్లులోని కళాకారులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. శతాధిక దర్శకుడు కోడి రామకృష్ణ సారధ్యంలోని లలిత కళాంజలి జాతీయ నాటక పరిషత్ 1995లో చంద్రమోహన్‌ను పాలకొల్లులో ఘనంగా సత్కరించింది. చంద్రమోహన్ లేరంటే నాడు ఆయన సన్మానంలో పాల్గొన్న సీనియర్ కళాకారులు మానాపురం సత్యనారాయణ, వంగా నరసింహ రావు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, మేడికొండ శ్రీనివాస్, గుడాల హరిబాబు, కెవి.కృష్ణవర్మ, వీరాస్వరం, కొటికలపూడి కృష్ణ, నీలంశెట్టి సత్యప్రసాద్ నమ్మలేకపోతున్నారు. అనేక పాత్రలను అలవోకగా నటించిన చంద్రమోహన్ నాడు సామాన్య కళాకారులతో స్నేహభావంతో ఉన్నారని చెబుతున్నారు. ఆయనతో నటించిన హీరోయిన్లు నేడు చిత్ర పరిశ్రమలో అగ్రగాములై ఉన్నారని గుర్తు చేశారు. 1984-85 సంవత్సరంలో ఆయన ఒక్కడికు సమీపంలోని పోడూరులో నాలుగ్గు చావిడి సినిమా షూటింగ్ పాల్గొన్నారు. రావుగోపాలరావుతో పాటు పలువురు సినీ నటులు వచ్చం రోజులుగా పోడూరులో ఉన్నారు. నాటి సినిమా షూటింగ్ విశేషాలను సీనియర్ నటులు జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదహారేళ్ల వయసు చిత్రాన్ని రాజమండ్రి, కొవ్వూరు, పోలవరంలో చిత్రీకరించారు. నాడు చిత్ర షూటింగ్ కోసం వెళ్లిన వారు చంద్రమోహన్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

పాలకొల్లులో లలిత కళాంజలి ఘన సన్మానం పొందిన చంద్రమోహన్ (ఫైల్)

సీసలిలో రూ.5 కోట్లకు పైగా అభివృద్ధి పనులు

గ్రామాభివృద్ధిలో గణేశ్న కుటుంబీకుల పాత్ర ఎనలేనిది

ప్రజాశక్తి - కాళ్ల

నిస్వార్థం, మొక్కవోని దీక్షతో గ్రామాభివృద్ధికి గ్రామ సచివాలయానికి ఆరు సెంట్ల భూమిని విరాళంగా ఇచ్చామని పంచాయతీ వార్డు సభ్యులు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న ఎన్‌విఎస్‌ఎస్ఎన్.నాయుడు(రాంబాబు) తెలిపారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. సీసలి గ్రామాభివృద్ధిలో గణేశ్న కుటుంబీకుల పాత్ర 47 ఏళ్ల నుంచి ఉందన్నారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా బిల్వకుర్తి ధనలక్ష్మి, ఉప సర్పంచిగా బాతు మాణిక్యాలరావు ఎన్నికయ్యారని, తాను పంచాయతీ వార్డు సభ్యునిగా రెండోసారి గెలుపొందానని రాంబాబు చెప్పారు. తమ తాతయ్య గణేశ్న సత్యనారాయణమూర్తి నాలుగుసార్లు గ్రామ సర్పంచిగా సేవలందించారన్నారు. తమ పెదనాన్న గణేశ్న శ్రీరాంబాబు 1981 నుంచి 1987 వరకు సర్పంచిగా, 2006లో ఎంపిటిసి సభ్యునిగా పని చేశారని వివరించారు. తమ చిన్నమ్మ గణేశ్న సుబ్బలక్ష్మి 2006లో సర్పంచిగా పని చేశారని, ఆ సమయంలోనే తాను పంచాయతీ వార్డు సభ్యునిగా తొలిసారి గెలుపొంది గ్రామాభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వ నిధులు రూ.5 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించడానికి స్థలం సరిపోలేదని చెప్పారు. గతంలో పంచాయతీ భవనాన్ని నిర్మించేందుకు ఐదు సెంట్ల స్థలాన్ని మా గణేశ్న కుటుంబీకులు ఇచ్చినట్లు తెలిపారు. మరో సెంటు స్థలాన్ని విరాళంగా ఇచ్చామన్నారు. ఇప్పటివరకు ఆరు సెంట్ల స్థలాన్ని పంచాయతీకి ఇచ్చినట్లు తెలిపారు. ఆ స్థలం విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందన్నారు.

రాంబాబు

ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.40 లక్షలతో జరుగుతున్న నూతన గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులు, సిఎం నిధులు సుమారు రూ.40 లక్షలతో ప్రత్యేక పైపులైన్ పనులు చేపట్టామన్నారు. ప్రతి ఇంటికి పైపులైన్ వేసి కుళాయి కనెక్షన్ ఇచ్చామన్నారు. పివిఎల్ నరసింహరాజు తాగునీటి పైపులను వదిలి ప్రారంభించారు. ఆ ప్రాంతంలో 70 గృహాలకు కుళాయిల ద్వారా నీటిని అందిస్తున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామాభివృద్ధికి కషి చేస్తున్నామన్నారు. గ్రామంలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక పైపులైన్ పనులు చేపట్టామన్నారు. సీసలిలో రక్షిత మంచినీటి చెరువు ప్రక్షాళన పనులు 27 ఏళ్ల తర్వాత రూ.6 లక్షలతో చేపట్టామన్నారు.

రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణానికి రూ.22 లక్షలు, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు రూ.17.50 లక్షలతో పనులు జరుగుతున్నాయన్నారు. సత్యనారాయణపురం ప్రాంతంలో పైపులైన్ పనులు రూ.2 లక్షలతో చేపట్టామన్నారు. సత్యనారాయణపురంలో నాడు-నేడు నిధులు రూ.22 లక్షలతో పాఠశాల భవనం, ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి విడత నాడు-నేడు నిధులు రూ.50 లక్షలతో హైస్కూల్ ఆధునికీకరణ పనులు చేపట్టామన్నారు. నాడు-నేడు నిధులుకోటి రూపాయలతో ఆరు అదనపు తరగతుల, భవనాల నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

హరిజనపేటలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. సీసలి స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో నాడు -నేడు నిధులు రూ.15 లక్షలతో, ప్రాథమిక పాఠశాల మెయిన్ పాఠశాలలో రూ.15 లక్షలతో నాడు -నేడు పనులు జరుగుతున్నాయన్నారు. వందమంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించి కోలనపల్లి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు చెప్పారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. శ్మశానవాటికలో ఉన్న ఆక్రమణ తొలగించి రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఐదో వార్డులో రూ.ఐదు లక్షలు, ఏడో వార్డులో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేపట్టామన్నారు. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలు, జెడ్‌పి నిధులు రూ.10 లక్షలు, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.ఐదు లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. గ్రామంలో పాత పైపులైను తొలగించి జలజీవన్ పథకంలో ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి రూ.50 లక్షలతో పనులు చేయాల్సి ఉందని తెలిపారు.

గ్రామ సచివాలయ నిర్మాణ పనులు

నేరాలు - ఘోరాలు

విద్యుత్ స్తంభం విరిగిపడి బాలుడు మృతి

ప్రజాశక్తి - ఆచంట

విద్యుత్ స్తంభం విరిగిపడి మూడో తరగతి చదువుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని అయోధ్యలంక పంచాయతీ పరిధి మర్రిమూలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అద్దాల స్వామిదాసుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విజయ్‌బాబు(8) మర్రిమూల ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వెళ్తుండగా దారిలో విద్యుత్ వైర్లపై బొబ్బాయి చెట్టు పడడంతో శిథిలావస్థకు చేరిన 1985లో వేసిన విద్యుత్ స్తంభం విరిగి విజయ్‌బాబుపై పడింది. దీంతో స్పృహ కోల్పోయిన బాలుడిని స్థానికులు హుటాహుటిన పి.గన్నవరం ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. బాలుని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడి తల్లి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశంలో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మృతి చెందిన బాలుడు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - కాళ్ల

మండల కేంద్రమైన కాళ్ల గ్రామానికి చెందిన వివాహిత ఉండ్రాజ్ఞ దుర్గ (28) మృతిపై ఆమె సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లిపుడం మండలం రామరాజుపాలెంకి చెందిన దుర్గకు, కాళ్ల గ్రామానికి చెందిన ఉండ్రాజ్ఞ యేసుకు 2015లో వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తలు అప్పుడప్పుడు గొడవలు పడుతుండేవారు. ఈ క్రమంలో దుర్గకు అనారోగ్యంగా ఉండడంతో కొన్నిరోజులు పుట్టింటికి వెళ్లానని భర్తను అడగగా ఆ విషయంలో ఇద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల ఏడో తేదీన ఇద్దరు గొడవ పడి దుర్గను ఆమె భర్త బిల్లు పట్టుకుని మంచానికి కొట్టగా తలకు బలమైన గాయమై ఆసుపత్రిలో కోలుకోలేక ఈ నెల పదో తేదీన మృతి చెందింది. మృతురాలి అక్క ఆకుమర్తి హేమలత శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎస్ఎన్.భద్రరావు కేసు నమోదు చేశారు. ఆకివీడు సిఐ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాట కేసులో నిందితుడికి జైలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండలంలోని దూసనపూడిలో 2021లో జరిగిన ఒక కోట్లాట కేసులో నిందితుడు కొట్టు శ్రీనివాస్‌కు మూడు నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ రమేష్ శనివారం తెలిపారు. అప్పటి ఎస్ఐ రామచంద్రమూర్తి ఈ కొట్లాటపై కేసు నమోదు చేయగా భీమవరం ఫస్ట్ ఎజెఎఫ్‌సిఎం కోర్టులో వాదనలు జరిగాయి. నిందితుడిపై నేరం రుజువు కావడంతో నిందితుడు శ్రీనివాస్‌కు న్యాయమూర్తి జి.సురేష్‌బాబు మూడు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

చర్చి పైనుంచి పడి పెయింటర్ మృతి

ప్రజాశక్తి - వీరవాసరం

చర్చికి రంగులు వేస్తుండగా అదుపుతప్పి కింద పడి పెయింటర్ మృతి చెందిన ఘటన వీరవాసరంలో చోటు చేసుకుంది. వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... పెనుమంట్ర మండలానికి చెందిన పెయింటర్ కందుల జయరాజు వీరవాసరం చర్చికి రంగులు వేస్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన అతడిని భీమవరం వర్మ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

చేప నూనె తరలిస్తున్న వాహనం పట్టివేత

ప్రజాశక్తి - వీరవాసరం

చేప నూనె అక్రమంగా తరలిస్తున్న ఒక వాహనాన్ని పట్టుకుని కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు అప్పచెప్పినట్లు వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎటువంటి బిల్లు లేకుండా అనధికారికంగా మూడు వేల లీటర్ల చేప నూనెను ఒక వాహనంలో తరలిస్తున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, చేప నూనెను స్వాధీనం చేసుకుని కమర్షియల్ టాక్స్ అధికారులకు అప్పచెప్పగా వారు సంబంధిత వ్యక్తులకు రూ.65 వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

దళిత ఉద్యోగుల సంక్షేమమే మేడ్ లక్ష్యం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగుల సంక్షేమమే మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ అన్నారు. స్థానిక హంగ్రీ బర్డ్స్ హోటల్‌లో మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ జిల్లా సమావేశం కండెల్లి వెంకట్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవపాల్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులందరూ ఐక్యత కలిగి ఉండాలన్నారు. ఐక్యతతోనే సమాజం నుంచి ఎదురవుతున్న వివక్షతను ఎదుర్కోవడంతోపాటు సమస్యలు కూడా పరిష్కారమవుతాయన్నారు. ఆర్థికంగా స్థిరపడిన దళిత ఉద్యోగులు తోటి నిరుద్యోగులకు, ఉన్నత చదువులు చదివేవారికి మానవతా దృక్పథంతో తమ వంతు సహకరించాలని కోరారు. మేడ్ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించి వారికి దిక్సూచిగా మేడ్ పనిచేస్తుందన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భావజాలంతో ఉద్యోగులందరూ పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ మేడ్‌లో సభ్యులుగా చేరాలని కోరారు. దళిత ఉద్యోగుల సంక్షేమం తమ లక్ష్యమని వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఆయన తెలిపారు. అనంతరం నూతన జిల్లా కమిటీని నియమించారు. మేడ్ జిల్లా అధ్యక్షులుగా కండెల్లి వెంకట్, ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి లిల్లీ గ్రేస్‌ను నియమించారు. మేడ్ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షులుగా గెడ్డం వినోద్, ప్రధాన కార్యదర్శిగా కొడవటి వెంకటేష్‌లను నియమించారు. తణుకు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సిహెచ్.ప్రియాంక, ఏడిద వెంకట్రావు, భీమవరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కడిమి అరుణ్‌కుమార్, పి.రత్నాకర్, నరసాపురం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సవరపు వెంకటేశ్వరారవు, గెడ్డం షాలేమ్‌రాజు నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మేడ్ నాయకులు రాజ్యలక్ష్మి, బి.రాజారావు, కె.రాజారత్నం, వి.శామ్యూల్ పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి ఎస్‌టి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యపడుతుందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, నియోజకవర్గ చర్చావేదిక టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రచ్చ బండ కార్యక్రమం వల్లూరు, భీమలాపురం గ్రామాల్లో ఆయా సర్పంచులు నేలపూడి బేబీ రామ్మోహన్‌రావు, గుబ్బల మాద వరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు నిరుద్యోగ సమస్య, రోడ్లు, డ్రయినేజీ, గృహ నిర్మాణంలో అవకతవకలు, నిత్యావసర వస్తువు ధరల పెరుగుదల, కరెంటు ఛార్జీలు, ఇసుక దోపిడీ వంటి అంశాలపై మాట్లాడారు. రచ్చబండ కార్యక్రమంలో పితాని మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరుగుతున్న దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. గ్రామాల్లో ప్రజలకు కనీస సౌకర్యాలు లేక వారి బాధ లు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్ర మంలో జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, ఎస్‌సి సెల్ ని యోజకవర్గ నాయకులు బీర నరసింహమూర్తి, మండల కార్యదర్శి ఏడిద శ్రీనివాస్, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస రావు, గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, ఉప సర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు గెద్దాడ సన్యాసిరావు, బండి వరప్రసాద్ పాల్గొన్నారు.

ఉచితంగా కంప్యూటర్, డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి - పాలకొల్లు

శివదేవుని చిక్కాల శ్రీరాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారి సహకారంతో కంప్యూటర్ శిక్షణ, లైట్ మోటర్ వెహికల్ డ్రైవింగ్ ఉచితంగా నేర్పించనున్నట్లు ట్రస్ట్ ఛైర్మన్ నిమ్మల రామారావు చెప్పారు. శనివారం ఆయన పాలకొల్లులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులకు ఆర్‌టిఒ ద్వారా ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించనున్నట్లు చెప్పారు. పైన పేర్కొన్న కోర్సుల్లో పూర్తిగా అర్హత, లైసెన్స్ పొందినవారికి ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి కింద అవకాశాలు ట్రస్ట్ ద్వారా కల్పించనున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెలాఖరులోగా శివప్రసాద్ 7416099599 సంప్రదించాలని కోరారు. కంప్యూటర్ శిక్షణకు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి 18 ఏళ్ల పైబడినవారు అర్హులన్నారు. కార్ డ్రైవింగ్ శిక్షణ పదో తరగతి ఉత్తీర్ణత కలిగి 20 సంవత్సరాలు పైబడినవారు అర్హులన్నారు.

రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్

విద్యార్థులకు దీపావళి బాణసంచా పంపిణీ

విద్యార్థినులకు దీపావళి మందులు అందిస్తున్న సరళాదేవి

ప్రజాశక్తి - తణుకు

లయన్స్ క్లబ్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ వావిలాల సరళాదేవి ఆర్థిక సాయంతో స్వర్ణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సాల్విన్ ఆర్మీ ఫీస్ ఆఫ్ హోంలోని విద్యార్థులకు దీపావళి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సరళాదేవి మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి దీపావళి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు దీపావళిని ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాక్షసులపై దేవతలు సాధించిన విజయమే దీపావళి అన్నారు. ప్రతిఒక్కరి జీవితంలో దీపావళి వెలుగులు నింపాలని అందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ ప్రిన్సిపల్ స్వరాజ్యం, లయన్స్ లీడర్స్ కెఎన్.పద్మావతి, వావిలాల శాంతిప్రసన్న, బూరుగుపల్లి వెంకట్రావు, బూరుగుపల్లి లలిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి వైసిపి చేయూత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మండలంలోని ఎల్‌విఎన్.పురం గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జక్కం కుమార్‌సాయిసుహాష్ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి వైసిపి నాయకులు ముందుకు వచ్చారు. రూ.1.50 లక్షలు సేకరించి స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ చేతులమీదుగా బాధిత కుటుంబానికి శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ కూడా అండగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా సుహాస్ కుటుంబానికి తమ సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పేరిచర్ల విజయనరసింహరాజు, ఎంపిడిఒ వెంకటలక్ష్మి, దిరుసుమర్రు గ్రామ సర్పంచి కోళ్ల బాలకృష్ణ, గొల్లవానితిప్ప సర్పంచి చిల్లే వెంకటేష్, మాజీ సర్పంయి గొట్టుముక్కల సత్యనారాయణరాజు (ధర్మరాజు), తిరుమాని ధనుంజయ పాల్గొన్నారు.

స్వెట్టర్లు, రగ్గులకు గిరాకీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఇలా శీతాకాలం ప్రారంభమైందో లేదో మార్టేరు సెంటర్‌లో రంగురంగుల స్వెటర్లు, రగ్గులు అమ్మకానికి సిద్ధం చేశారు మధ్యప్రదేశ్ ప్రాంతవాసులు. ప్రతి సంవత్సరం తణుకు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం వంటి పట్టణాల్లోనే కాకుండా మార్టేరు, ఆలమూరు వంటి గ్రామీణ ప్రాంతాల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన రాహుల్ పంజారా, లాకన్ పంజారాలు స్వెటర్లు, రగ్గులు అమ్మకాలు చేస్తుంటారు. కొన్నిరోజుల క్రితం అమ్మకాలు ప్రారంభించామని వారు చెబుతున్నారు. ఆకర్షణీయమైన రంగులు, డిజైన్లతో చిన్నారుల నుంచి నిడి వయస్సు వారి వరకు ధరించే స్వెటర్లు, రగ్గులు రూ.300 నుంచి రూ.900 వరకు అమ్మకాలు చేస్తామని వ్యాపారులు చెబుతున్నారు.

మార్టేరు సెంటర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వెటర్లు, రగ్గులు

ఆర్థిక సాయం చేస్తున్న లయన్ క్లబ్ సభ్యులు

ఇంజినీరింగ్ విద్యార్థికి లయన్స్ క్లబ్ చేయూత

ప్రజాశక్తి - ఉండి

విద్యలో రాణిస్తూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత ఇస్తుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు వేగేశ్న అనంతలక్ష్మి అన్నారు. కలిదిండి రామచంద్రరాజు పార్క్ వద్ద ఉండి గ్రామానికి చెందిన కొల్లి వరలక్ష్మికి శనివారం రూ.15 వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ దాతలు లయన్ కలిదిండి సీతారామరాజు, లయన్ సత్తిబ్రహ్మారెడ్డి, లయన్ బుద్ధరాజు సుబ్బరాజు ముందుకు వచ్చి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. క్లబ్ వైస్ ప్రెసిడెంట్, గాదిరాజు రంగరాజు, సత్తి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ సేవలందిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ అడ్మినిస్ట్రేటర్, మాజీ అధ్యక్షులు రుద్రరాజు నరసరాజు, బుద్ధరాజు సుబ్బరాజు మాట్లాడుతూ గతంలో ఎన్ఆర్‌పి అగ్రహారానికి చెందిన విద్యార్థికి ప్రతి ఏటా రూ.20 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ.80 వేలు, కలిగొట్లకు చెందిన విద్యార్థికి ఆర్థిక సహాయం చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కలిదిండి సీతారామరాజు భూపతిరాజు, హరినాథ్‌రాజు, బొండాడ సూర్య బ్రహ్మానందం పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని ఆరుగొలను గ్రామానికి అడ్డగర్ల సత్యనారాయణ ఇటీవల తాపీ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారి పడి గాయాలపాలయ్యాడు. జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన ఆరుగొలను గ్రామ నాయకులు ఆ కుటుంబాన్ని శనివారం పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం జనసేన మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బత్తిరెడ్డి రత్తయ్య, మండల ప్రధాన కార్యదర్శి కోట శ్రీరామ్, గ్రామ నాయకులు అడపా వీరన్న, చిక్కాల రామానాయుడు పాల్గొన్నారు.

సమిష్టి కృషితోనే నేరాల నియంత్రణ : డిఐజి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నేరాల నియంత్రణకు పోలీసులు సమిష్టిగా కృషి చేయాలని, నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు టూటౌన్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి డిఐజి తనిఖీ చేశారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రికార్డులను తనిఖీ చేశారు. క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపి, ఎవరినీ ఉపేక్షించకుండా కేసులు నమోదు చేయాలన్నారు. స్పీడ్ ట్రయల్ కేసుల్లో విచారణ త్వరగా పూర్తిచేసి నేర స్తులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సిబ్బంది పనితీరు, వారి విధు లు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీట ర్లకు ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూ వారిపై నిఘాపెట్టాలని సూచించారు. నేరాల అదు పునకు పోలీసుల సంఖ్య పెంచి ఎప్పటికప్పుడు నగరంపై నిఘా ఉంచాలని ఆయన సూచిం చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేస్తూ వాహనాలను సీజ్ చేయాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A. 634/2018, I.A. 593/2012
O.S. 329/2010
పిటీషనరు/పిటీషనరు/వాది:
నాళం వెంకట లక్ష్మీనారాయణ
Vs
రెస్పాండంట్లు/రెస్పాండెంట్లు/ప్రతివాద్లు:
తమ్మినైన హరికృష్ణ (died)
శ్రీమతి తమ్మినైన లక్ష్మి
To రెస్పాండెంటు:
2) శ్రీమతి తమ్మినైన లక్ష్మి, W/o. లేటు హరికృష్ణ, రామచంద్రరావుపేట, ఏలూరు, ఏలూరు మండలం, ఏలూరు జిల్లా ELR SCJC Limits.
పై నెంబరు దావాలో వాది/పిటీషనరు అయిన నాళం లక్ష్మీనారాయణపై దివి. 09-04-2018 సం॥ తేదీన I.A. 593/2012 జప్తు పిటీషనులోను, దావాలోను శ్రీ కోర్టు వారు పాస్ చేసిన Default Order ను రద్దుచేసి, జప్తు పిటీషనును, దావాను Restore చేయించమని పిటీషనరు/వాది దాఖలు చేసిన పై నెంబరు జప్తు పిటీషను I.A. 593/2012 దావాలోనూ మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకొనక బుద్ధిపూర్వకంగా Avoid చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం యీ పేపరు ప్రకటన యివ్వబడినది. కాబట్టి **దివి. 24-11-2023 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥ల** లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాయిదా: 24-11-2023
కె.వి.వి.హరిమోహన్
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్
కొవ్వూరు కొవ్వూరు
06-11-2023 సెల్:9160061613

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి, తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజీమేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్, ఫొటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814